క్లుప్తంగా

కార్తీకమాసంలో 'మన గుడి'

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా మనగుడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం ఆర్గనైజర్ ఎం.లలితమణి ఒక ప్రకటనలో తెలిపారు. నక్కవీధి ఉమా జఠలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20న హరికథాగానం, 21 నుంచి 27 వరకు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు తెప్పోత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఇంద్రపుష్కరిణిలో ఈ నెల 24న జరగనున్న హంసనావికోత్సవం (తెప్పోత్సవం) ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు అనివేటి మండపంలో నిర్వహిస్తున్నట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ పాలకమండలి సభ్యుల సమక్షంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళా కబడ్డీ జట్టు ఎంపికలు శనివారం పొందూరులోని సిస్టం కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో జరగనున్న టోర్నమెంట్‌లో పాల్గొంటోందన్నారు. ఏఫిలియేషన్ కళాశాల ప్రిన్సిపాళ్ల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

హెల్త్ క్లినిక్‌కు కుర్చీలు వితరణ



కుర్చీలను అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: పెంట గ్రామంలోని హెల్త్ క్లినిక్‌కు గ్రామానికి చెందిన ఎస్.ప్రదీప్‌కుమార్ పది కుర్చీలను సమకూర్చారు. వీటిని సర్పంచ్ పున్నాన సోనియా, వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కలనాయుడు ద్వారా ఎంఎల్‌ఎస్‌పీ ఎ.శుభాషినికి శుక్రవారం అందజేశారు. క్లినిక్‌కు వచ్చే వారికి కుర్చీలు అనుకూలంగా ఉంటాయని సర్పంచ్ సోనియా అన్నారు. సచివాలయం సిబ్బంది వావిలిపల్లి మనోజ్‌కుమార్, తరిణి వాసు, అలుగోలు సుధాకర్ ఉన్నారు.

ఘనంగా నందెన్న అనుపోత్సవం



నందెన్నను ఊరేగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ బుచ్చిపేట రామమందిరం వద్ద నందెన్న అనుపు ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నందెన్నను తలపై ఉంచి ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల కర్రసాము ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై అవగాహన



ఈ–క్రాప్ నమోదు పత్రాలు అందజేస్తున్న ఏఓ

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సానివాడలో రైతుభరోసా కేంద్రం వద్ద శుక్రవారం ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మొక్కజొన్న, రాగి, అపరాలు, కట్టిజనుము వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలను వ్యవసాయాధికారి ఉషాకుమారి వివరించారు. అనంతరం రైతులకు ఈ–క్రాప్ నమోదు పత్రాలు అందజేశారు.

ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఒలింపియాడ్–2023 (నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్) పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని శ్రీకాకుళంలోని మహాలక్ష్మినగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ తెలిపారు. అత్యధికంగా 260 మంది విద్యార్థులు సెకెండ్ లెవెల్‌కు అర్హత సాధించారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీచైతన్య రీజనల్ ఇన్‌చార్జి శీపాన రామినాయుడు, ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ ఏ.బాలరాజు, జోనల్ అకడమిక్ డీన్ పి.మోహన్‌బాబు, పాఠశాల అకడమిక్ డీన్ సీహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఇంద్రమౌళి పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరుకి చెందిన 46 మంది లబ్ధిదారులకు ఉచితంగా ఉజ్వల ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి కె.కల్పన పాల్గొన్నారు.

నగర రోడ్ల అభివృద్ధికి.. రూ.3.90 కోట్లు

- మున్సిపల్ సాధారణ నిధులతో పనులు
- బలగ కుమ్మరివీధి నుంచి ఆదివారంపేట వరకు ట్యాంకు బండ్ రోడ్డు
- హౌసింగ్ బోర్డు కాలనీ, పాత్రునివలన, తంగివానిపేట ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి
- గతంలో మంజూరై చేపట్టని 21 పనులు రద్దు



నాగావళి నది గట్టుపై బలగ కుమ్మరివీధి వరకు నిర్మించనున్న రోడ్డు ఇదే

శ్రీకాకుళం: నగర పరిధిలోని రోడ్లకు మహర్దశ కలగనుంది. రూ.3 కోట్ల 90 లక్షల వ్యయంతో శ్రీకాకుళం నగరంలో పలు రోడ్లను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి అంచనాలకు నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆమోదం తెలిపారు. మున్సిపల్ సాధారణ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో నాలుగు రోడ్లు, సింహద్వారం సమీపంలోని వెంకటాపురం నుంచి పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలోని యాతపేట వరకు ఉన్న రోడ్డును రూ.77.5 లక్షలతో నిర్మించనున్నారు. పాత్రునివలస వద్ద గుర్రం చెరువు నుంచి శివారు వరకు, చాపురం వార్డు నుంచి పాత్రునివలస వరకు రూ.70.6 లక్షలతో రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. తంగివానిపేట పరిధిలోని వానవానిపేట నుంచి పెద్దపాడు వరకు ఉన్న రోడ్డుని రూ.1.19 కోట్ల ఖర్చుతో నిర్మించేందుకు అంచనాలను సిద్ధం చేశారు. బలగ కుమ్మరివీధి నుంచి ఆదివారంపేట (శ్రీకాకుళం–పాలకొండ రోడ్డు శివారు) వరకు నాగావళి నది వరదగట్టుపై నుంచి కొత్తగా ట్యాంకు బండ్ రోడ్డు పేరిట బైపాస్ రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు రూ.1.23 కోట్లు నిధులు విడుదల చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి కుమ్మరివీధి సమీపంలో కొంత భూసేకరణ అవసరం కాగా అక్కడి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డు విస్తరణకు అవసరమయ్యే స్థలం ఇచ్చేందుకు అంగీకరించారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే పాలకొండ రోడ్డులో ట్రాఫిక్ తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ పనులన్నీ ఫిబ్రవరి నెలాఖరునాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా తీసుకున్నారు.

ప్రారంభం కాని పనులు రద్దు..

నగరంలో గతంలో మంజూరై ప్రారంభించని 21 పనులను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పాత ధరల ప్రకారం పనులు చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చే అవకాశం లేకపోవటం, కొందరు కాంట్రాక్టర్లు నేటికీ పనులు ప్రారంభించకపోవటంతో ఆయా పనులను రద్దు చేశారు.

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి



నగరంలో రూ.3.90 కోట్లతో చేపట్టనున్న రోడ్ల పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేస్తాం. గత మూడు నెలల్లో నాలుగు రోడ్ల పనులు పూర్తి చేశాం. పనులన్నీ మున్సిపాల్టీ సాధారణ నిధులతో చేపడుతున్నాం.

– ఓబులేసు, మున్సిపల్ కమిషనర్, శ్రీకాకుళం

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలి

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల/లావేరు: చిలకపాలెంలో ఈ నెల 27వ తేదీన జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చేలా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కృషి చేయాలన్నారు. లావేరు మండలం బుడతవలస, గుమ్మడాం, బెజ్జిపురం, పెద్దరావుపల్లి, బుడుమూరు, తాళ్లవలస, చిన్నమురపాక, మురపాక, లక్ష్మీపురం, తామాడ, లోపెంట గ్రామాల్లో శుక్రవారం పర్యటించి బస్సు యాత్రకు సంబంధించి పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించి చర్చించారు. కార్యక్రమానికి జనం స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు దన్నాన రాజినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొర్లె అప్పలనాయుడు, సర్పంచ్‌లు గౌతు సురేంద్ర, దుర్గాశి ధర్మారావు, నాయకులు దాలినాయుడు, నాగం కనకరాజు, ముప్పిడి శ్రీరాములు, వల్లె సూర్యనారాయణ, అమర్‌నాథ్, చిమ్మారావు, లక్ష్మణ్, గోవింద్, జగదీష్, సూర్యం, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సంతవురిటిలో భూసర్వే



డ్రోన్ కెమెరాతో సర్వేకు సిద్ధమవుతున్న సిబ్బంది

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో శుక్రవారం డ్రోన్ కెమెరా ద్వారా మీ భూమి.. మా హామీ పథకంలో భాగంగా సర్వే చేపట్టారు. నడిమివలస గ్రామంలో సుమారు రెండువేల ఎకరాల్లో భూ సర్వే చేసేందుకు కెమెరా ఏర్పాటు చేశారు. భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ హనుంతురావు పర్యవేక్షణలో సర్వే చేపట్టారు. పంచాయితీలో ఉన్న భూ సమస్యను పరిష్కారం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బుడారి లక్ష్మణరావు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పిల్లల శివకుమార్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, చందనాల రంగారావు, వీఆర్వో శ్రీనివాసరావు, సర్వేయర్ మొయ్యి ఈశ్వరరావు, పావని, పంచాయతీ కార్యదర్శి హిమబిందు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధంలో భాగంగా గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా కేశవరావుపేట గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం పార్టీ జెండా ఆవిష్కరణ, ప్రభుత్వ పథకాల ప్రచార ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి 24 పేజీల బుక్‌లెట్ అందజేసి అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, మండల యువజన విభాగం అధ్యక్షుడు కొత్తకోట సూర్యారావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పైడి భాస్కరరావు, నాయకులు గురుగుబెల్లి లక్ష్మన్నాయుడు, పైడి నర్సింగరావు, వావిలపల్లి చైతన్య, కొత్తకోట చంద్రరావు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలు బలోపేతం

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళా రైతు ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేస్తున్నట్టు సంబంధిత సంఘాల (వెలుగు) ఏపీఎం ఎ.హరికృష్ణ చెప్పారు. ఎచ్చెర్లలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. సంఘాలు అర్హత బట్టి ఏడు సంఘాలకు రూ. 4.10 లక్షలు రుణం మంజూరు చేసినట్లు చెప్పారు. స్వయం సహాయ సంఘాల తరహాలో మహిళా రైతు సంఘాలను కూడా బలోపేతం చేస్తామన్నారు. వెలుగు ఏపీఎం ఆర్.రామ్మూర్తి ఉన్నారు.

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు



శ్రీకాకుళం అర్బన్‌వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



గార: చైర్‌గేమ్‌లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు 'దిశా చట్టం–మహిళ సాధికారత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు చాడా శ్రీనివాసరావు, చోడవరపు ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్, గవర్నమెంట్ జూనియర్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో సుమారు 30 మంది కవులు తమ రచనలు వినిపించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎస్.వి.రమణ మూర్తి, పి.రామ్మోహన్, టి.రాంబాబు, యు.కళ్యాణి, పి.వరలక్ష్మి, పి.భానుమతి, శివ గణేష్ పాల్గొన్నారు.

గార: మండల కేంద్రం గారలోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్ గేమ్స్ నిర్వహించారు. నాలుగు, ఐదో తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.రామకృష్ణ, అప్పారావు, చింతల సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల, ధర్మవరం గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వారోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఎచ్చెర్ల గ్రంథాలయంలో పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఏపీ గ్రంథాలయ పరిషత్ అధికారులు మహేష్‌బాబు, రవికుమార్ పాల్గొన్నారు. ధర్మవరం గ్రంథాలయం పరిధిలో పాఠశాలల విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు నీలమ్మ, మలిపెద్ది చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

జి.సిగడాం: విద్యార్థుల్లో పోటీతత్వం ద్వారానే మెరుగైన ఫలితాలను సాధించగలరని జి.సిగడాం శాఖా గ్రంథాలయం అధికారి సీహెచ్ వెంకటేష్ అన్నారు. గ్రంథాలయం ఆవరణలో 6, 7, 8, 9, తరగతి విద్యార్థులకు 'ప్రస్తుత రాజకీయాల అభిప్రాయాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని దేవాలయంగా భావించాలని సూచించారు.

కాలేజీల్లో హెచ్‌సీఎల్ టెక్‌బీ అవగాహన సదస్సులు



పి.దుర్గారావు, ఆర్ఐఓ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కాలేజీల్లో హెచ్‌సీఎల్ టెక్‌బీ సంస్థ ప్రతినిధులు ఇంటర్మీడియెట్ తర్వాత లభిస్తున్న ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారని జిల్లా ఆర్ఐఓ పి.దుర్గారావు శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియెట్ తర్వాత డిగ్రీ చదువుతోపాటు ఉద్యోగ అవకాశాలపై విశదీకరిస్తారని చెప్పారు. సెకెండియర్ విద్యార్థులంతా సదస్సుల్లో పాల్గొనేలా చేయాలని, రిజిస్ట్రేషన్లు కూడా చేపట్టాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. పూర్తి వివరాలకు హెచ్‌సీఎల్ టెక్‌బీ.కామ్ వెబ్‌సైట్‌ను గానీ, సంస్థ ప్రతినిధులు సాయికిరణ్: 9642973350, గురునాథ్: 7780754278, యోగేష్: 6300378377 లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సంతోషిమాతకు కార్తీక పూజలు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో కార్తీక మాసం మొదటి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు అభిషేకాలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నాగమ్మా..చల్లంగా చూడమ్మా..!

నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శుక్రవారం ఉదయాన్నే పుట్టల వద్దకు చేరుకుని నాగదేవతకు పూజలు నిర్వహించారు. అందరూ బాగుండాలని ఆకాంక్షిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. పుట్టలో పాలు, గుడ్లు వేసి నైవేద్యాలు సమర్పించారు. కుటుంబ సభ్యులంతా ఒకేచోట చేరి సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: పుట్టలో పాలుపోస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు



శ్రీకాకుళం కల్చరల్: పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు



రణస్థలం: జె.ఆర్.పురంలో నాగదేవతకు పూజలు చేస్తున్న ఉమ్మడి కుటుంబాలు



జి.సిగడాం: పుట్టదగ్గర మందుగుండును కాలుస్తున్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: గణేష్‌నగర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి సత్యసాయి జన్మదిన వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని పలు సత్య సాయి మందిరాలలో ఈ నెల 18 నుంచి 23 వరకు సత్య సాయి 98వ జన్మ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకర్స్ కాలనీలోని సాయి బృందావనంలో సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ట్లు మందిర కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. గార మండలం జల్లపేటలో గ్రామ సేవా యజ్ఞం నిర్వహించి ప్రేమ తరులో భాగంగా మొక్కలు నాటడం, 19న మహిళా దినోత్సవం, 20న యువజన దినోత్సవం, 21న సేవా దినోత్సవం, 22న బాలవికాస్ దినోత్సవం, 23న సత్యసాయి 98వ జన్మదినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యూకాలనీలోని చిన్న పుట్టపర్తి మందిర్‌లో 19న వెయ్యి మంది భక్తులతో నగర సంకీర్తన, 108 మొక్కలు నాటే కార్యక్రమం, పలు భక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తామని, 23న 21కేజీల కేక్ సమర్పిస్తా మని చెప్పారు. పీఎన్ కాలనీ మందిరంలో ఈ నెల 19 నుంచి 23 వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. హయాతినగరంలోని సత్య సాయి మందిరంలో 23న అమృత కలశాలు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తామని నిర్వాహకులు కిల్లాన ఫల్గుణరావు తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీ సత్యసాయి మందిరంలో సత్యసాయి వ్రతాలు నిర్వహిస్తామని కన్వీనర్ బెహరా భాస్కరరావు తెలిపారు.

అరసవల్లి: అరసవల్లి శాంతిక్షేత్రంలో సత్యసాయిబాబా 98వ జన్మదినోత్సవ వేడుకలు శనివారం నుంచి ఈనెల 23 వరకు నిర్వహిస్తున్నామని శాంతిక్షేత్రం కన్వీనర్ బి.ఎస్.ప్రసాదరావు తెలిపారు.

బాలాత్రిపుర సుందరికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నదీతీరంలో బాలాత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తాచాటాలి



క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లోనూ రాణించి పతకాలు సాధించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తెనాలి వేదికగా ఈ నెల 18, 19 తేదీలలో ఏపీ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు శుక్రవారం ఇక్కడి నుంచి పయనమై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అతిథులు, సంఘ ప్రతినిధులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ కొమర భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్ర పోటీల్లో జిల్లా నుంచి 28 మంది బాలబాలికలు ప్రాతినిధ్యం వహిస్తున్నారని చెప్పారు. ఈ పోటీల్లో రాణించిన వారు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, ఇస్కాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నరసింహులు, కురుటి తారకరామ, సకుముల శివాజీ, కొమర మోహన్ కృష్ణ పాల్గొన్నారు. తైక్వాండో బృందానికి కోచ్ మేనేజర్లుగా కురిటి తారకరామ, లక్ష్మణరావు, ఎం.శిరీష వ్యవహరించనున్నారు.



కులగణనకు సంబంధించి ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాలు, కుల సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో శుక్రవారం నిర్వహించిన అభిప్రాయ సేకరణ(రౌండ్ టేబుల్ సమావేశం)కు విశేష స్పందన లభించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, సామాన్యులు హాజరై సలహాలు, సూచనలు అందజేశారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/ శ్రీకాకుళం పాతబస్టాండ్